www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -354 బుధవారం 1 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# రేపటి నుంచి గ్రామ సభలు

## కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన

### కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్,మార్చి31 ప్రజావినికిడి,**
ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు, వార్డు సభలను కచ్చితంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక అమలు, పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో

మిగతా 2లో.



## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు

విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ

24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



# రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

కాంగ్రెస్ నేతల పై ప్రధాని మోదీ ఫైర్

ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ నిలకడగా ఉందని వ్యాఖ్య

కాంగ్రెస్ వదంతులు వ్యాపింపజేస్తోందని తీవ్ర విమర్శలు

గుజరాత్‌లోని డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించిన ప్రధాని

ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెసే కారణమని ఆరోపణ

2లో.

## టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి..




### నేటి నుంచి కొత్త నిబంధన!

ఇకపై ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు

రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసేందుకే ఈ నిర్ణయం

ఫాస్టాగ్ లేని వాహనాలకు జరిమానాలు విధించే అవకాశం

ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచన

**, న్యూఢిల్లీమార్చి31 ప్రజావినికిడి,**దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. రేపటి (ఏప్రిల్ 1వ తేదీ) నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది.

మిగతా 2లో.

# పవన్ కల్యాణ్ శాఖకు అవార్డుల పంట..

24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ

డిప్యూటీ సీఎం నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 5 జాతీయ అవార్డులు

రెండు విభాగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్

**, న్యూఢిల్లీ మార్చి31 ప్రజావినికిడి,** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది.

మిగతా 2లో.



## నేడు లోక్‌సభలో ‘అమరావతి’ బిల్లు

2024 జూన్ 2 నుండి అమలులోకి



**అమరావతిమార్చి31 ప్రజావినికిడి,**
లోక్‌సభ ముందుకు నేడు (బుధవారం) అమరావతి బిల్లు రానుంది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్దత కల్పిస్తూ రూపొందించిన ఈ బిల్లును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన కసరత్తును కేంద్ర ప్రభుత్వ పూర్తి చేసింది. 2024 జూన్ రెండవ తేది నుండి అమరావతికి చట్టబద్దత అమలులోకి

మిగతా 2లో.

## ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

బంకర్ బస్టర్లతో అమెరికా విధ్వంసం

దుబాయ్‌లో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి

హార్ముజ్‌లో టోల్ వసూలుకు ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర

‘ధైర్యం చూపండి..చమురు తెచ్చుకోండి’ : రెచ్చగొడుతున్న ట్రంప్

అమెరికా అధ్యక్షుల మెహర్బానీ కోసం గల్ఫ్ దేశాల వెంపర్లాట



2లో.

# అకాల వర్షం

ఈదురుగాలుల ధాటికి నేలకొరిగిన వరి, మొక్కజొన్న

మామిడి రైతులకు తీవ్ర నష్టం



**నిజామాబాద్‌మార్చి31 ప్రజావినికిడి,**
పంటలు చేతికి వస్తున్న తరుణంలో రైతుల ఆశలను అకాల వర్షం ‘తుంచేసింది’. సోమవారం అర్ధరాత్రి వేళ..ఒక్కసారిగా వేగంగా వీచిన ఈదురుగా లులు, వర్షం, వడగండ్లతో పలు చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొట్టదశలో, కోతకు సిద్ధమై ఉన్న వరి నేలవాలడంతో రైతుల ఆవేదన చెందుతున్నారు. దీంతోపాటు ఈదురుగాలుల ధాటికి మామిడి కాయ లు రాలిపోయాయి. మొక్కజొన్న, నువ్వు పంటపై సైతం వర్షం ప్రభావం చూపింది. నిజామాబాద్ మార్కెట్ యార్డులో కొంత మేర పసుపు నీటమునిగింది. రాశులుగా పోసి ఉండగా.. అడుగు భాగంలో నీళ్లు చేరడంతో రైతులు కుప్ప నుంచి తడిచిన దాన్ని వేరు చేసి ఆరబెట్టారు.

మిగతా 2లో.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ



## కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధం ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత కరువు

దిశానిర్దేశం లేకుండా ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలి

పొంగులేటి అవినీతిని బయటపెట్టినందుకే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్ : మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ మార్చి31 ప్రజావినికిడి,**
కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో రైతులకు శిక్ష వేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద ద్వేషం ఉంటే తమకు శిక్ష వేయాలనీ, రైతుల పొట్ట కొట్టొద్దని కోరారు. తక్షణమే నిధులను విడుదల చేసి కాలువలకు నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన వ్యాఖ్యలు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయనీ, బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందని విమర్శించారు

మిగతా 2లో.

# రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

## కాంగ్రెస్ నేతల పై ప్రధాని మోదీ ఫైర్

**, న్యూఢిల్లీ మార్చి31 ప్రజావినికిడి,**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం



పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు.

ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నారు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు.

ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.90 వేల కోట్లు, రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులిచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని వివరించారు. భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువలకు వెళ్లి నీళ్లు వదులుతున్నారనీ,అవి కాళేశ్వరం నీళ్లు కావా?అని ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారనీ, అది కాళేశ్వరంలో భాగం కాదా? అని అడిగారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళ్లు తేవడం కోసం రూ.ఎనిమిది వేల కోట్లతో కాలువలు తవ్వుతున్నారనీ, మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ వెళ్లి సాగునీటిని, పంటలను చూద్దామనీ, నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో రైతులను అడుగుదామని కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, కిషన్‌రెడ్డి, బండి సంజరుతోపాటు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. రూ.50 కోట్లు విడుదల చేస్తే కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులివ్వకుండా పగబట్టిందని విమర్శించారు.

**తూతూమంత్రంగా అసెంబ్లీ**

దిశా నిర్దేశం లేకుండా తూతూమంత్రంగా అసెంబ్లీ సమావేశాలు ముగిశాయని హరీశ్‌రావు అన్నారు. ఆరు గ్యారెంటీలపై స్పష్టత కరువైందని చెప్పారు. ప్రజా సమస్యలపై చర్చకు పారిపోయి, కేరళ ఎన్నికల కోసం అసెంబ్లీని అర్థాంతరంగా ముగించారని విమర్శించారు. మంత్రి పొంగులేటి అవినీతిని ఆధారాలతో బయటపెడితే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారని అన్నారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాడిన అహంకారపూరిత, వీధి రౌడీల భాషను ఎథిక్స్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల పక్షాన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసిందని చెప్పారు. తమకు శాసనసభ మాత్రమే వేదిక కాదనీ, ప్రజాక్షేత్రంలో అన్ని వేదికలపైనా ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, విజయుడు, బి లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజరు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం

ఇప్పటికే ధర తక్కువ వస్తున్న తరుణంలో అకాల వర్షంతో ఇంకేమి కొర్రీలు పెడతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అర్ధరాత్రి వేళ 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచగా.. అనంతరం వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి పంటలకు నష్టం వాటిల్లగా.. చెట్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగాయి. ప్రస్తుతం వరి పొట్టదశలో, కోత దశకు సిద్ధంగా ఉండగా.. నేలకొరిగింది. ఇదివరకే పలు చోట్ల కోతలు పూర్తయి ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లోని 76 గ్రామాల్లో వర్షం వల్ల మొత్తం 2557 ఎకరాల మేర వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో అంతకు ఎక్కువే నష్టపోయినట్టు రైతులు వాపోతున్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో జొన్న పంట నేలకొరిగింది. రాజంపేట్ మండల కేంద్రంలోని పశు వైద్యశాలలోకి వర్షపు నీరు చేరింది.

జగిత్యాల జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు, మోస్తరు వర్షం కురిసింది. ముఖ్యంగా మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయికల్ మండలంలో అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం.. సుమారు 3,180 ఎకరాల్లో మామిడి పంట నష్టపోయింది. గాలుల తీవ్రతకు మామిడి కాయలు రాలిపోవడంత పాటు కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అదే విధంగా 75 ఎకరాల్లో నువ్వుల పంట, 18 ఎకరాల్లో వరి, 202 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. భీమారం, పెగడపల్లి, ధర్మపురి మండలాల్లో మామిడి తోటలు, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మంగళవారం వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండలంలోని మంగళపల్లి, చిట్యాలపెల్లి, దేశాయిపేట, గుమ్లాపూర్, ఆర్నకొండ, కాట్నపల్లిలో సోమవారం అర్ధరాత్రి గాలివానకు మొక్కజొన్న, వరి, మామిడి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంతోపాటు మల్యాల గ్రామంలో వడగండ్ల వాన కురిసింది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి, ఎలిగేడు, ముత్తారం మండలాల్లో ఈదురు గాలులకు మొక్కజొన్న పంట నేలకొరిగింది.

# రేపటి నుంచి గ్రామ సభలు

రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలియజేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం
ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధికంగా పాల్గొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సభల సందర్భంగా లబ్దిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఫీల్డ్ స్థాయిలో అమలు, ప్రజల భాగస్వామ్యం, విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని సిఎస్ పునరుద్ఘాటించారు. కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు.అనంతరం ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభలలో అనుసరించాల్సిన కార్యకలాపాల క్రమాన్ని కలెక్టర్లకు వివరించారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఒకే విధంగా, సమర్థవంతంగా జరిగేందుకు నిర్మిత అజెండాను ఆయన వివరించారు. కాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ / అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ వార్డు సభల సందర్భంగా 100 శాతం పన్ను వసూళ్లు సాధించిన మున్సిపల్ సిబ్బందిని సత్కరించాలని సూచించారు. ఇది పట్టణ పాలనలో ఉత్తమ పనితీరును గుర్తించి ప్రోత్సహించడానికి చేపట్టిన చర్య అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు ప్రసంగిస్తూ ఏప్రిల్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న హెల్త్ వీక్ గురించి కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

------

# మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,మార్చి31 ప్రజావినికిడి,**

మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్ లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామని చెప్పారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సం ప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు లోక్‌సభలో 'అమరావతి' బిల్లు

మొదటిపేజీ తరువాయి

వచ్చేలా ఈ బిల్లును రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును సవరించి రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరును చేర్చాలని, తద్వారా చట్ట బద్దత కల్పించాలని మార్చి 28వ తేదిన రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఆ తీర్మానంలో ప్రతిపాదించిన వివిధ అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం తాజా బిల్లు లక్ష్యాలులో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం -2014 ప్రకారం హైదరాబాద్ పది సంవత్సరాల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగే విషయం తెలిసిందే. ఆ గడువు 2024 జూన్ ఒకటవ తేదితో ముగియడంతో రెండవ తేది నుండి అమరావతిని రాజధానిగా గుర్తించాలని తాజా బిల్లులో పేర్కొన్నారు. ఆ మేరకు పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5, సబ్‌సెక్షన్ 2లో అమరావతిని ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా పేర్కొంటూ, 2024 జూన్ రెండవ తేది నుండి అమలులోకి వచ్చేలా సవరిస్తూ ప్రతిపాదించారు.

పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధతకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సంబరాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రాజధాని ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

# టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి..

మొదటిపేజీ తరువాయి

ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది.రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో నగదు రహిత విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ వసూళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండా వేగంగా వెళ్లేందుకు ఇది దోహదపడుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.అయితే, ఈ మార్పు వల్ల డిజిటల్ చెల్లింపులకు సిద్ధంగా లేని కొంతమంది ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సరైన ఫాస్టాగ్ లేని లేదా అందులో తగినంత బ్యాలెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో అటువంటి వాహనాలను టోల్ ప్లాజా వద్ద నిలిపివేసే అవకాశం కూడా ఉంది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశారు. ఒకవేళ ఫాస్టాగ్‌లో సమస్య ఉంటే, టోల్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి యూపీఐ ద్వారా తక్షణమే చెల్లింపులు చేయవచ్చు. అయితే, కొన్నిసార్లు నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఈ లావాదేవీలు ఆలస్యం కావచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.అందువల్ల ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే ఫాస్టాగ్ గా యాక్టివ్‌గా ఉంచుకోవడం, దానిలో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవడం చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ తెలిపింది. ఫాస్టాగ్‌ను తమ బ్యాంకు ఖాతాతో సరిగ్గా లింక్ చేసుకోవడం కూడా ముఖ్యం. ముందుజాగ్రత్తగా స్మార్ట్‌ఫోన్‌లో పనిచేసే యూపీఐ యాప్‌ను సిద్ధంగా ఉంచుకోవడం మంచిది. ఈ మార్పు భారతీయ రహదారుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చడంలో ఒక కీలక ముందడుగుగా పరిగణిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ శాఖకు అవార్డుల పంట..

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే... రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కించుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసుకుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో ఏపీ పనితీరు విశేషంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో ఇదే విభాగంలో 24వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులను ప్రోత్సహించే 'జల్ సంచయ్ - జన్ భాగీదారీ' కార్యక్రమంలోనూ ఏపీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'పల్లెపండుగ 1.0', 'పల్లెపండుగ 2.0' వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా 'పల్లెవెలుగు' కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం.

# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

టెహ్రాన్: ఇరాన్‌లో అణుకేంద్రాలు కలిగి ఉన్న కీలక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో భీకర స్థాయిలో విరుచుకుపడింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఈ విషయాన్ని పేర్కొంది. మరోపక్క ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే, ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా- ఇజ్రాయిల్ దాడులకు పాల్పడ్డాయని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దాడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకోగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై ఇరాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు.. తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే..ఇరాన్‌లో భారీ విధ్వంసాన్ని సృష్టిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇక్కడ భారీఎత్తున దాడులు జరగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఉచిత బస్సుతో మహిళలకు మేలు

## పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు

## ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు -మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్,మార్చి31 ప్రజావినికిడి,:** తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 1 ఏప్రిల్ 2026

# ప్రతి గ్రామ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.. -చౌదర్ గూడ లో 29 లక్షలతో నిర్మించిన నూతన సిసి రోడ్లు ప్రారంభోత్సవం**

**నిధులు కేటాయింపు పై ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు.. గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం**





**ప్రజావినికిడి, (శంషాబాద్): మార్చి 31,**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని చౌదర్ గూడ గ్రామంలో 29 లక్షలతో నిర్మించిన నూతన సిసి రోడ్డును రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని
ఇటీవల కాలంలో చౌదర్ గూడ గ్రామపంచాయతీలో ఉన్న సిసి రోడ్లు అధ్వానంగా పాడైపోవడంతో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ లక్ష్మీ లింగం నూతన సీసీ రోడ్ల నిధుల కోసం స్థానిక ఎమ్మెల్యేకు వివరించగా వెంటనే 29 లక్షల రూపాయలు నూతన సిసి రోడ్లకు నిధులు చేయించారు.
మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామంలో నూతనంగా సిసి రోడ్లను 29 లక్షల వ్యయంతో వేయగా ఈ యొక్క కార్యక్రమం గ్రామ సర్పంచ్ లక్ష్మి లింగం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన సిసి రోడ్లను ప్రారంభించారు.
సిఆర్ఆర్ ఫండ్ కింద మంజూరైన 29 లక్షల రూపాయల నిధులతో గ్రామపంచాయతీ లోని ప్రధాన రహదారుల్లో సిసి రోడ్లను నిర్మించడం జరిగిందని,ప్రతి గ్రామ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఇందుకు చౌదర్ గూడ గ్రామంలో నూతనంగా సిసి రోడ్లు వేయించడం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్ లక్ష్మీ లింగం మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులను కేటాయించడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేసి గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ప్రేమ్ రాజ్, పంచాయతీ కార్యదర్శి రమేష్, మాజీ జెడ్పిటిసి తన్వి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి,శివాజీ,తాళ్ల జయమ్మ , మోహన్ రావు, మంజుల జంగయ్య,సుజాత సుధాకర్, మామిళ్ళ సబితా మల్లేష్ యాదవ్, అరుణ పెంటయ్య, బక్క రాజు,ఎం. దేవేందర్,పొగాకు మల్లేష్ తాళ్ల ఆంజినేయులు గౌడ్,తాళ్ల బిక్షపతి గౌడ్,తాళ్ల ప్రసాద్ గౌడ్ గ్రామ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఘోరం

## భార్య,కుమారుడిని హత్య చేసిన భర్త



**ప్రజావినికిడి,(అమన్ గాల్)**
:ఫ్యూచర్ సిటీ కమిషనరేట్, అమన్ గల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగోనిపల్లి తండాలో నిన్న అర్ధరాత్రి ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది.కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్య, కుమారుడిని దారుణంగా హత్య చేయడంతో ప్రాంతంలో కలకలం రేగింది.పోలీస్ అధికారుల వివరాల ప్రకారం,పులిగోనిపల్లి తండాకు చెందిన బానవత్ రాందాస్ (32) మద్యం మత్తులో తన భార్య కవిత (28) అలాగే ఏడేళ్ల కుమారుడు హర్షను హత్య చేసినట్లు వెల్లడించారు.ఈ ఘటనలో పదేళ్ల కుమార్తె ప్రణీత తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది.
విషాదకర సంఘటన విషయం తెలియగానే మహేశ్వరం ఏసీపీ ఎస్.జానకి రెడ్డి,అమంగల్ ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.
కుటుంబ కలహాలే ఈ దారుణ ఘటనకు కారణమని అధికారులు నిర్ధారించారు.
తీవ్రంగా గాయపడిన బాలిక ప్రణీతను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.
అమంగల్ ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి,తదుపరి దర్యాప్తును వేగవంతం చేశారు.

# బాల కార్మిక వ్యవస్థ నిషేధంపై రైతులకు అవగాహన

**ముందస్తు నోటీసులు అందజేత**

**మైనర్ పిల్లలను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం, -ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.హరికృష్ణ**





**ప్రజావినికిడి,(వాజేడు):ఏప్రిల్ 1,**
మంగళవారం మహిళాభివృద్ధి & శిశు సంక్షేమ శాఖ – ములుగు ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బాల కార్మిక నిషేధ & క్రమబద్ధీకరణ చట్టం – 1986 (సవరణ చట్టం – 2016) పై మిర్చి రైతులకు అవగాహన నిర్వహించడం జరిగింది.జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా వాజేడు మండలంలోని వివిధ గ్రామాలలోని రైతులకు ముఖ్యంగా మిర్చి రైతులకు ప్రత్యేక అవగాహన నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా జిల్లా బాల పరిరక్షణ విభాగము, చైల్డ్ హెల్ప్ లైన్ & మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తో కూడిన బృందం రైతుల వ్యవసాయ క్షేత్రాలు,మిర్చి కల్లాల వద్ద ప్రత్యక్షంగా సందర్శనచేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.హరికృష్ణ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ అనేది బాలల ఎదుగుదలకు ఒక గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. ములుగు జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించి, మన ములుగు జిల్లాను బాలల కార్మిక రహిత జిల్లాగా చేయాలనే ధృడ సంకల్పంతో గౌరవ స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి డా.ధనసరి అనసూయ (సీతక్క) ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశానుసారం ములుగు జిల్లాలో ముఖ్యంగా మిర్చి పండిస్తున్న గోదావరి పరీవాహక ప్రాంత మండలాల్లో అధికారులు మిర్చి రైతుల పొలాల వద్దకు వెళ్లి బాల కార్మిక నిషేధ మరియు క్రమబద్ధీకరణ చట్టం – 1986 (సవరణ చట్టం – 2016) పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ చట్టం ప్రకారం 14 సం.ల లోపు మైనర్ పిల్లలను ఏ పనిలో కూడా పెట్టుకోవద్దని, 15-18 సం.లోపు వయస్సున్న రైతులకు కౌమార దశ పిల్లలను హానికరమైన పనుల్లో పెట్టుకోవడం పూర్తిగా నిషేధం అని రైతులకు అవగాహన కల్పించి,ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి 2 సంవత్సరాల జైలు లేదా ₹50,000 జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని నోటీసుల ద్వారా ముందస్తుగా తెలియజేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో ముఖ్యంగా మిర్చి తోటల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు రైతులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా బాలల పరి విభాగము కౌన్సిలర్ టి. సంధ్య,మహిళా సోషల్ వర్కర్ బి. జ్యోతి,మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ ఆర్.స్రవంతి, వాజేడు మండలంలోని వివిధ గ్రామాల రైతులు కూలీలు తదితరులు పాల్గొన్నారు

## దుసకల్ గ్రామ టిఆర్ఎస్ యువ నాయకుడు కావాలి

**అశోక్ యాదవ్ - కొత్త రేషన్ కార్డుల పంపిణీ**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.లబ్ధిదారులకు రేషన్ కార్డులేనివారికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని సభ్యుడు కావాలి అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కావాలి అశోక్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.రేషన్ కార్డు ద్వారా ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు సకాలంలో అందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, యువకులు గ్రామ ప్రజలు లబ్ధిదారులు ప్రభుత్వానికి కావాలి అశోక్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు

## బడ్జెట్ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్వాగతం


**కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** నియోజకవర్గంలోని కొత్తూరు మున్సిపల్ లో బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మున్సిపాలిటీ అధ్యక్షుడు జండ గూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొండారెడ్డి సుమన్ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్,కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,కమ్మరి జయమ్మ జనార్దన్ చారి,మాజీ సర్పంచ్ జగన్,షాద్ నగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్,మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు రవికుమార్ గుప్తా,చిల్కమర్రి నరసింహ,పెంటయ్య యాదవ్, చింత సాయి తేజశ్వర్,నరసింహ గౌడ్,విక్రమ్,తదితరులు పాల్గొన్నారు

## హెచ్.సి.ఏ కార్యదర్శిగా ఎన్నికైన జీవన్ రెడ్డిని సన్మానించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన మన్నే జీవన్ రెడ్డిని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సన్మానించారు. హైదరాబాద్ క్రికెటర్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎంపిక పట్ల ఆనందం వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.






# గాలిదుమారంతో నేలరాలిన మామిడి కాయలు

**ప్రజావినికిడి,(వాజేడు):**
మండలంలో మంగళవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన తెలికపాటి వర్షం పడటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మిర్చి వరి మామిడి రైతులకు కొంత నష్టం వాటిల్లింది మామిడికాయలు కల్లాలో ఆరబోసిన మిర్చి తడిసింది వరి నేలకొరిగింది మండలంలో రైతులకు కొంత నష్టం ఏర్పడింది తెల్లవారుజాము కావడంతో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేకపోయారు.

# దేవాదాయ శాఖలో ఉద్యోగాలు ఇంత సులువా.?

నోటిఫికేషన్, ఇంటర్వ్యూ లేకుండా ఉద్యోగం పొందవచ్చు.?

అధికారులని ప్రసన్నం చేస్తే ఉద్యోగం పక్కా నట.?

దేవాదాయ శాఖలో అర్హత లేని వాళ్లకు ఉద్యోగాలు

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వాళ్లపై చర్యలు..

ప్రభుత్వం విచారణ చేసి నిరుద్యోగులకు న్యాయం చేసేనా.?




**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ఎలాంటి విద్యార్హతలు లేకున్నా ఉద్యోగం వచ్చేస్తుంది. నోటిఫికేషన్ అవసరం లేదు, ఇంటర్వ్యూ అసలే ఉండదు,అయినా మీరు ప్రభుత్వ ఉద్యోగం పొందవచ్చు కొంచెం ఖర్చు అవుతుంది అంతే అది కూడా అధికారులకు నైవేద్యం ఇస్తేనే

తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ శాఖలో జరుగుతున్న ఉద్యోగాల దందా తీరు. నిబంధనలు, అర్హతలు, పారదర్శకత అన్న మాటలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఎలాంటి నియామక ప్రక్రియ పాటించకుండా, వెనుక ద్వారాల ద్వారా ఉద్యోగాలు కేటాయించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం పరిపాలనా లోపమే కాకుండా వ్యవస్థపరమైన అవినీతికి నిదర్శనంగా మారింది.

దేవాలయాలు ప్రజల విశ్వాసానికి ప్రతీకలు. అలాంటి పవిత్ర స్థలాల నిర్వహణలో పనిచేయాల్సిన వారు పోస్టుకు తగ్గ అర్హతలు, నియమాలు పాటించవాల్సింది పోయి, డబ్బు ఉన్నవారికి ఉద్యోగాలు అమ్ముతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో పోస్టుకు 5 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తున్నారన్న ప్రచారం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. దేవాదాయ శాఖలో జరుగుతున్న అవినీతి కాకుండా భక్తుల నమ్మకంపై దెబ్బగా భావించాల్సిందే అని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

కనీస విద్యార్హతలు లేని వ్యక్తులు కూడా ఉద్యోగాలలో చేరుతున్నారన్న సమాచారం నిరుద్యోగులను మరింత కలవరపెడుతోంది. జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఆర్థిక ఇబ్బందులు తట్టుకొని పీజీలు చదివితే నోటిఫికేషన్లు వెయ్యకుండా దేవాదాయ శాఖలో లోలోపల భర్తీ చేయడం పై నిరుద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అర్హతలున్న నిరుద్యోగులు నిరాశలో మునిగిపోతుంటే, డబ్బు ఉన్నవారికి అవకాశాలు కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధం జరుగుతుంది. ప్రభుత్వ శాఖలో ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేయడం కానీ ఇప్పుడు అది వ్యాపారంగా మారిందన్న భావన బలపడుతోంది.

ఈ వ్యవహారంలో ఉన్నత అధికారులు, మధ్యవర్తులు కలిసి వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### గుట్టు చప్పుడు కాకుండా అంతర్గత నియామకాలు

దేవాదాయ శాఖలో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఎలాంటి రాతపరీక్షలు లేకుండా, ఇంటర్వ్యూలు లేకుండా ఉద్యోగాలు ఎలా కేటాయిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,కమిషనర్ పై ఉంది. అయితే ఇప్పటివరకు ఈ ఆరోపణలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదని

విజిలెన్స్ విభాగం ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇలాంటి పెద్ద స్థాయి అవినీతి ఆరోపణలు ఉన్నప్పుడు, తక్షణమే సిబిసిఐడి చే విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటివరకు నిశ్శబ్దంగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన దేవాదాయ శాఖలో ఈ తరహా అక్రమాలు కొనసాగితే, భవిష్యత్తులో మరింత పెద్ద సమస్యలకు దారితీయొచ్చు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించి, పారదర్శక విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే చదువుకోవాల్సిన అవసరం లేదు అనే భావన పూర్తిగా వ్యాప్తి చెందడం ఖాయం.

ఇప్పటికైన అయిన కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని చర్యలు తీసుకుంటుందా.? లేక ఈ అవినీతి దందాను గాలికి వదిలేస్తుందా.? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన సమయం రేవంత్ రెడ్డి సర్కార్ పై ఉంది.

# షాద్ నగర్ చౌరస్తా విస్తరణకు రంగం సిద్ధం

**షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**

**చౌరస్తా ప్రాంగణాన్ని పరిశీలించిన హెచ్ఎండిఏ ఏఈ విశ్వతేజ**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్ నగర్ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చౌరస్తా విస్తరణ కార్యక్రమం త్వరలోనే అధికారులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణ చౌరస్తాలో హెచ్ఎండిఏ శాఖకు చెందిన ఏఈ విశ్వతేజ సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలించారు. చౌరస్తా విస్తరణలో భాగంగా సదర్ ప్రాంతాన్ని తిలకించారు. ఈ సందర్భంగా చౌరస్తా విశేషాలను స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ (అప్పి),పెంటయ్య, కళ్యాణ్ కార్ దిలీప్,నాయకులు ముబారక్ అలీ ఖాన్,సాదిక్, వీర్లపల్లి మహబూబ్ తదితరులు వారి వెంట ఉన్నారు. ఎంతోకాలంగా చౌరస్తా విస్తరణ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం అయ్యిందని అయితే అన్ని అవసరాలకు అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం చేపట్టబోయే పనులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలబడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం ప్రజలు వ్యాపారస్తులు అందిస్తున్నారని చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.




# ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి31 ప్రజావినికిడి,** ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ. 5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు. ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ కోరారున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ట్యాంక్ బండ్ శివ, కుటుంబసభ్యులు.

# ఆటో ఎల్పీజీ సరఫరాను పెంచండి

**కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రికి ఉత్తమ్ లేఖ**

**హైదరాబాద్, మార్చి31 ప్రజావినికిడి,**వాహనాలకు ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఏర్పడిన సంక్షోభాన్ని నివారించేందుకుగాను సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. గ్యాస్ కొరత కారణంగా రాష్ట్రంలో ఆటో రంగంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. 'రాష్ట్రంలో సుమారు లక్ష ఎల్పీజీ ఆటో రిక్షాలు తిరుగుతున్నాయి. ఆటో ఎల్పీజీ గ్యాస్‌ను ప్రభుత్వ, ప్రైవేటు ఆపరేటర్లు వేర్వేరుగా అందిస్తున్నాయి. ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ వంటి పీఎస్‌యూలు సమష్టిగా 33 అవుట్‌లెట్లను నిర్వహి స్తూ 20 శాతం వాటా కలిగి ఉండగా.. ప్రైవేటు ఆపరేటర్లు రాష్ట్రంలో 110 అవుట్‌లెట్లతో 80శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి' అని లేఖలో ఉత్తమ్ వివరించారు. ప్రస్తుతం నెలకొన్న సరఫరా పరిమితుల కారణంగా రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో వాటి అవుట్‌లెట్లన్నింటిలో కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తాయని, వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ రంగ సంస్థల అవుట్‌లెట్లలో ఆటో ఎల్పీజీ లభ్యతను పెంచాలని కోరారు. ప్రభుత్వరంగ అవుట్‌లెట్లలో ఆటో ఎల్పీజీ ప్రస్తుత ధర లీటరుకు రూ. 75 ఉండగా ప్రైవేటు కంపెనీలు లీటరుకు రూ. 93 విక్రయిస్తున్నాయని, కొరతను ఆసరాగా చేసుకుని ఎక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రజా రవాణా, ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# యాంటీ ర్యాగింగ్,యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం..

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
( ఎం.బీ.బీ.ఎస్ వైద్య విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ , డ్రాంక్ & డ్రైవ్ , సైబర్ క్రైమ్ ఫోన్లో లలో అనేక అప్ ల వాడకం వల్ల దుష్పరిణామాలు హెల్మెట్ లేకుండా డ్రైవింగ్,సిట్ బెల్ట్ గురించి,అతి వేగా రోడ్డు ప్రమాదాలు & యాంటీ ర్యాగింగ్,యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమంఆర్విఎం హాస్పిటల్ లో మంగళవారం అనగా 31-3-2026 రోజు ఎం.బీ.బీ.ఎస్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కోసం సీపీ సిద్దిపేట్ గౌ శ్రీ.రష్మీ పెరుమాళ్ మేడం .ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలు & యాంటీ ర్యాగింగ్,యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మేడమ్ మాట్లాడుతూ, డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. చాలామంది యువతి యువకులు సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు. ఆదేవిదంగా విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ



తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలోఅర్.వి యం చైర్మన్ డాక్టర్ అర్ యాకయ్‌మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ గాజ్వెల్ ఏసీపీ కె. నర్సింహులు. డాక్టర్,రాజేందర్ ప్రిన్సిపాల్. డి.రవి రాజ్ సీఐ గజ్వెల్ రూరల్,యం,మురళి సీఐ ట్రాఫిక్ గజ్వెల్,వి రఘుపతి ఎస్ ఐ మొలుగుల తో పాటు అర్ వి యం డీన్ఓ.శ్రావణ్ కుమార్, డైరెక్టర్ గోపీ




కృష్ణ, సీ.ఈ.ఓ దేవరకొండ శ్రీనివాస్ రావు,విజిలెన్స్ ఆఫీసర్ కె.రవి కుమార్ , సీ ఎస్ ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# ఇప్పపూవు సారాకు వేల ఏళ్ల చరిత్ర

**దీనిపై మాట్లాడితే దుష్ప్రచారమా? -మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**హైదరాబాద్,మార్చి31(ఆర్ఎన్ఎ):** తను ఇప్పపూవు సారా గురించి చెబితే తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. కల్తీసారా తాగకండి అంటే తనను బద్నాం చేస్తారా అంటూ ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ అనేది లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదివాసీలు లిక్కర్ తయారుచేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే కరెక్టా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పసారాకు 3 వేల ఏళ్ల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పసారా ఇండియన్ లిక్కర్ అని ఆయన అభివర్ణించారు. ఇప్పసారాకు శతాబ్దాల చరిత్ర ఉందని అనిరుధ్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. గతంలో దీన్ని తాగి 110 ఏళ్లు



బతికారని ఆయన వివరించారు. అనిరుధ్ వ్యాఖ్యలపై ప్రజలు తమదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా సినీతారలపై అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీతారలు కూడా టెస్ట్ చేయించు కోవాలని ఆయన సూచించారు. వారిపైనే అధికంగా డ్రగ్స్ ర్యూమర్స్ ఉన్నాయని గుర్తుచేశారు. కానీ రాజకీయ నాయకులపై ఈ పుకార్లు తక్కువేనన్నారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించు కోవాలంటూ సినీనటులకు సూచించారు. డ్రగ్ టెస్ట్‌లో నెగెటివ్ వస్తేనే షూటింగ్స్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ బారినపడిన వారు చిత్ర పరిశ్రమలలోనే అధికంగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం రేవంత్ మద్యం, ధూమం వంటివాటికి దూరంగా ఉంటారన్నారు. తాము కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నామని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పిఆర్సీ,డిఎలు విడుదల చేయాలి

## లేకుంటే టెన్త్ స్పాట్ బహిష్కరిస్తాం

## పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్

**నల్లగొండ,మార్చి31 ప్రజావినికిడి,** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పీఆర్సీ, డీఏలను తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా కులగణన రెమ్యూనరేషన్ ఇవ్వలేదని, కంటి తూడుపుగా గత సంవత్సర ఎస్ఎస్సీ స్పాట్ వాల్యూయేషన్ డబ్బులు విడుదల చేస్తున్నారని, అలా కాకుండా పూర్తి స్థాయిలో అందజేయాలని లేని పక్షంలో పదో తరగతి స్పాట్ బహిష్కరిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండతో పాటు పలు ప్రాంతాలోని పాఠశాలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ సన్మానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళవారం రాత్రి వరకు పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కుల గణన చేసిన సర్వే రెమ్యూనరేషన్స్ సహితం ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికి అమలు చేయకపోవడంతో తీవ్ర మనోవేదనలో ఉన్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు డివిఎస్ ఫణికుమార్, నల్లగొండ ఎంఈఓ కత్తుల అరుందతి, పీఆర్టీయూ నల్లగొండ మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల భాస్కర్ గౌడ్, బొడ్డు నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

## తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం

## మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



హైదరాబాద్,**మార్చి31 ప్రజావినికిడి,** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...ఈ మేరకు పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 – 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# నగరంలో కల్తీ నూనె దందా

## వాడేసిన నూనె ప్యాకెట్లలో నింపి అమ్మకం

## ముఠాను గుర్తించి పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్‌మార్చి31 ప్రజావినికిడి,** హైదరాబాద్‌లో కల్తీ వంట నూనె దందా తీవ్ర కలకలం రేపుతోంది. హైటెక్ సిటీలో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. హోటళ్లలో వాడిన వంటనూనెను కిలోకు రూ.20కు సేకరిస్తున్న ముఠా... దాన్ని వీధి వ్యాపారులకు రూ.70కు అమ్ముతున్నట్లు బయటపడింది. లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ముఠా గుట్టు బయటపడింది. నాచారం ప్రాంతంలో శుద్ధి పేరుతో మళ్లీ ప్యాకెట్లలో నింపుతూ దందా చేస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు... కల్తీ నూనె సేకరిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని రెస్టారెంట్ల నుంచి వాడిన నూనెను సేకరించి.. కర్ణాటక రిజిస్ట్రేషన్ ఆటోలో వందల లీటర్లు తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 20 డబ్బాల్లో కల్తీ నూనెను గుర్తించారు. నిందితులు సరైన పత్రాలు చూపించలేక తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు వీధి వ్యాపారులకు కల్తీ వంట నూనెను అమ్ముతున్నట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

# రాష్ట్రంలో ముదురుతున్న ఎండలు

## సాయంత్రాలు పలుచోట్ల వర్షాలు

**హైదరాబాద్‌మార్చి31 ప్రజావినికిడి,**



రాష్ట్రంలో ప్రస్తుతం భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పగలంతా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉక్కపోత, వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయంత్రం ఆకాశం మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటన విడుదల చేసింది.సోమవారం ఎండలు మండిపోయి దాదాపు 30 జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. జగిత్యాల జిల్లా ఆరుట్లలో అత్యధికంగా 41.9 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం, మంచిర్యాల జిల్లా కాసీపేట, నల్లగొండ జిల్లా పెద్దవూర, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొన్నది. వచ్చే 4 రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే ఉంటాయని వివరించింది.

# చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

## నలుగురు పోలీసులకు గాయాలు




**విజయవాడ,మార్చి31 ప్రజావినికిడి,:**కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

# నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

**ఇక శాశ్వత రాజధానిగా అమరావతి**

**ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం**

**టిడిపి ఎంపిలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి**



**న్యూఢిల్లీ, మార్చి31 ప్రజావినికిడి,**
రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. అమరావతి తీర్మానం లోక్‌సభ ఆమోదం తరవాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుందని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు రాజధానిపై అసలు స్పష్టత లేదని విమర్శించారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఎంపీ లావు గుర్తు చేశారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని.. ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్‌లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని.. ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని.. రాజధాని సైతం వారి హయంలోనే గుర్తిస్తున్నారని ఎంపీ అప్పలనాయుడు వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. వైసీపీ నేతలు సైతం రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది చెంపపెట్టు అన్నారు. రాజధాని అమరావతిపై జగన్ తన వక్రబుద్ధి చూపించారని చెప్పారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడి దార్శనికత అందరికీ తెలుసునన్నారు. అమరావతి కోసం ప్రాణత్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా పాదాభివందనం చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎంపి అప్పలనాయుడు చెప్పారు.



## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు: మంత్రి కొల్లు రవీంద్ర

**మార్చి31 ప్రజావినికిడి,**
రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్‌తో పాటు పేర్ని నానిని లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. “బందరులో ఒక బఫూన్ ఉన్నాడు. షాడోలను అడ్డుపెట్టుకుని అక్రమంగా చెరువులు తవ్వించాడు. మడ అడవులను సైతం ఆక్రమించి చెరువులుగా మార్చేశాడు“ అని పేర్ని నానిని ఉద్దేశించి కొల్లు రవీంద్ర ఆరోపించారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేసి భూములు దోచుకోవడానికి నాని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వంలో ఇలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.

# ఏప్రిల్ 14న తొలి క్వాంటం కంప్యూటర్




**అమరావతి మార్చి31 ప్రజావినికిడి,**
అమరావతి క్వాంటం సెంటర్లో ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటర్ (టెస్టింగ్) ఏర్పాటు చేస్తున్నారని, ఇది విద్యార్థులకు క్వాంటం టెస్టు కోసం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం క్వాంటం వ్యాలీ, హార్డ్‌వేర్ ఎకోసిస్టమ్స్‌పై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్డ్‌వేర్ ఉత్పత్తి, ఆల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీ దేశానికి కొత్త దిశను చూపిస్తుందన్నారు. 2030 నాటికి ప్రపంచంలో ఐదు గ్లోబల్ హబ్‌లలో ఒకటిగా అమరావతి నిలుస్తుందని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం ఐటిని, ఇప్పుడు క్వాంటంను అందిపుచ్చుకుంటు న్నామని తెలిపారు. అవేర్ ద్వారా రియల్‌టైమ్ డేటా సేకరించడంతోపాటు రియల్‌టైమ్‌లో నిర్ణయాలు జరిగేలా చేపట్టామని తెలిపారు. ఎఐ డాక్టర్, ఎఐ ట్యూటర్, ఎఐ అగ్రనామిస్ట్ వంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందని తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న రాజధాని ఎనిమిది టవర్లలో ఆవిష్కరణలు, పరిశోధనలు, స్టార్టప్‌లకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. హార్డ్‌వేర్‌ను దిగుమతి చేసుకోకుండా ఇక్కడే తయారు చేసుకునేలా ప్రణాళిక ఉంటుందని వివరించారు. దీనికి అవసరమైన టెక్నాలజీ అందించాలని నేషనల్ క్వాంటం మిషన్‌ను కోరారు. రానున్న రోజుల్లో అత్యుత్తమ క్వాంటం హబ్‌గా రాష్ట్రం నిలుస్తుందని నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టరు డాక్టర్ జెవిబి రెడ్డి తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఏర్పాటైన నేషనల్ క్వాంటం మిషన్ విజన్‌కు అనుగుణంగా రాష్ట్రంలో ఏర్పాటుకు సిఎం చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐబిఎం, టిసిఎస్ వంటి సంస్థల భాగస్వామ్యంతో క్వాంటం టెక్నాలజీకి పెద్దయెత్తున చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఇప్పటికే వేలాది మందికి శిక్షణ ఇస్తున్నామని, దీనికి జాతీయ క్వాంటం మిషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అనేక కంపెనీలు, స్టార్టప్‌లు దీనిలో భాగస్వామ్యం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎపి క్వాంటం మిషన్ అపెక్స్ కమిటీ ఛైర్మన్ మద్రాసు ఐఐటి డైరెక్టరు డాక్టర్ కామకోటి ఆన్‌లైన్లో మాటా ్లడారు. అమరావతి క్వాంటం సెంటర్ పరిధిలోకి రానున్న మూడేళ్లలో వెయ్యికిపైగా స్టార్టప్‌లు వస్తున్నాయని తెలిపారు. దీనికి అనుగుణంగా సదుపాయాలు కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. అమరావతి క్వాంటం సెంటర్ (ఎక్యూసి) డైరెక్టరు సివి శ్రీధర్ మాట్లాడుతూ.. 2030 నాటికి ప్రపంచంలో టాప్ 5 క్వాంటం హబ్‌లలో అమరావతి ఒకటిగా నిలవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికోసం ఎనిమిది టవర్లతో కూడిన భవనాలు నిర్మిస్తున్నామని, ఏప్రిల్ 14న మేథాటవర్స్, ఎస్ఆర్ఎంలోని సెంటర్లలో క్వాంటం కంప్యూటర్ టెస్టు జరుగుతుందని పేర్కొన్నారు. అక్టోబరు నాటికి ఇన్నోవేషన్ సెంటర్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు.ఎక్యూసి ఎక్స్‌పర్ట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. అమరావతిలో నిర్మించే ఎనిమిది టవర్లలో రెండిటిని క్వాంటం టెక్నాలజీ హార్డ్‌వేర్ ఆపరేషనల్ సిస్టమ్ కోసం నిర్మిస్తున్నారని తెలిపారు. క్యూబిట్స్ ప్రతినిధి మల్లికార్జున్ మాట్లాడుతూ.. తమ సంస్థ డీప్ టెక్నాలజీ, పొజిషనింగ్, లేజర్ అప్లికేషన్, సెమీ కండక్టర్ వంటి అంశాల్లో పనిచేస్తుందని తెలిపారు. క్వాంటం ఎఐ గ్లోబల్ ప్రతినిధి చిట్టూరి సంజరు మాట్లాడుతూ.. ప్రతి విదార్థినీ క్వాంటం నిపుణుడిగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సీడాక్ ప్రతినిధి మాగేష్ యథిరాజన్, డిడాట్ ప్రతినిధి డాక్టర్ రాజకుమార్ ఉపాధ్యాయ, క్యూబిట్ ఫోర్స్ ప్రతినిధి డాక్టర్ వెంకట సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ఎం ప్రొఫెసర్ సతీష్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# భారత ఎన్నికల తీరు మారాల్సిందే



**మార్చి31 ప్రజావినికిడి,**
ఎన్నికల సంస్కరణలు చేయకుండా, పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెంచినంత మాత్రాన భారత్ భవిష్యత్ మారదు. రాజకీయ పార్టీలకు మేలు చేసే నిర్ణయాలు తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం లేదు. ప్రధానంగా పదేపదే సభ్యులు కొందరే పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఎన్నికవుతున్నారు. దీనిని అరికట్టాల్సి ఉంది. సీట్లు పెంపు తీరును తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తప్పు పడుతున్నారు. దీంతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని అంటున్నారు. దీనిపైనా చర్చించాలి. దేశంలో ప్రజలకు రాజకీయ అవకాశం రావాలి. ముఖ్యంగా దళిత, గిరిజన, మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు రావాలి. వారిని ఈ దేశ అధికారంలో భాగస్వామ్యం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కేవలం కొన్ని సీట్లు వారికి కేటాయిస్తు న్నాయి. రాకీయంగా దళితులు, గిరిజనులకు కనీసం 50శాతం సీట్లు రిజర్వ్ చేయాలి. అందులోనూ గతంలో వరుసగా ఎన్నికవుతూ వస్తున్న వారిని మళ్లీ పోటీకి దూరం చేయాలి. అలాగే రెండు టర్మ్‌లకు మించి అవకాశం లేకుండా సంస్కరణలు చేయాలి. లేదా రాజ్యాంగ సవరణ చేయాలి. అప్పుడే ఇప్పుడు పాతుకు పోయిన వారు బయటకు పోతారు. పార్లమెంట్, అసెంబ్లీలో కొత్తతరం ప్రవేశిస్తుంది. కొత్తగా ఆలోచిస్తారు. ఇటీవల పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ తూతూ మంత్రంగా సాగింది. అసలు విషయాలను పక్కదారి పట్టించేలా చేశారు. ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. అధికార బిజెపి లేదా ఎన్‌డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించి, రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. ఇలాంటి ఎన్నికల వల్ల కొందరే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. అలాగే ఒక వ్యక్తి రెండుచోట్ల పోటీ చేసే పద్ధతిని కూడా రద్దు చేయాలి. గతంలో రాహుల్ రెండుచోట్ పోటీ చేశారు. మోడీ చేశారు. ఇప్పుడు తమిళనాట విజయ్ కూడా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీనివల్ల కూడా ఖజానాపై భారం పడుతుంది. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీలది ఒకటే దారిగా ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నేతలు నియంతలుగా మారుతున్నారు. ఈ క ÷-రమంలో ఇప్పుడు పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల మరికొందరు చట్టసభల్లోకి వస్తారు. దీంతో ఖజానాపై మరింత భారం పడుతుంది. అలాగే వారికి సౌకర్యాలు పెరుగుతాయి. అందువల్ల ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు, జీతభత్యాలు, పెన్షన్లను కూడా రద్దు చేయాలి. ఒక్కో ప్రజాప్రతినిధి రెండేసి పెన్షన్లు కూడా పొందుతున్నారు. పార్లమెంటుకు పనిచేసి, అసెంబ్లీకి ఎన్నికైన వారు రెండుచోట్లా పెన్షన్లు పొందుతున్నారు. అందుకే చట్టసభలకు తప్ప, సభ్యులకు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే విధానం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్దత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని వితండ వాదనతో దీనిని వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది.

--------------

# హార్ముజ్‌పై ఇరాన్ పట్టుబిగింపు

## ఇక్కడి నుంచే వెళ్లే నౌకలకు టోల్ వసూల్ -ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్

**టెహ్రాన్, మార్చి31 ప్రజావినికిడి,**
చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హార్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హార్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది.




కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అ టోల్ వ్యవస్థను అనుసరించి ఇప్పటికే 26 నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించినట్లు తెలిపింది. ఆయా నౌకలు అవసరమైన పత్రాలు సమర్పించి అనుమతి కోడ్‌లు పొందినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి. దీనిని ఖండిస్తూ, హార్మూజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాలపై ఏకపక్ష నియంత్రణను ప్రపంచ దేశాలు అంగీకరించబోవని హెచ్చరించింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యలను వ్యంగ్యంగా విమర్శిస్తూ, అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని పేర్కొన్నారు. ఇదే సమయంలో జీ7 దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా కొనసాగేందుకు తక్షణ చర్యలు అవసరమని సూచించాయి.

# హైదరాబాద్‌లో జయలలిత ఇల్లు సీజ్

## ఇంటిపన్ను చెల్లించకపోవడంతో చర్యలు





**హైదరాబాద్, మార్చి31 ప్రజావినికిడి,**
తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన ఇల్లు సీజ్ చేశారు. ఇంటిపన్ను బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆమె ఇంటిని జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆమె ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఫిబ్రవరిలోనే ఆస్తిపన్ను బకాయిలపై నోటీసులు జారీ చేశారు. అయితే జయలలితకు సంబంధించివారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ క్రమంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న జీ?4 భవనాన్ని సీజ్ చేశారు. ఈ ఇంటికి సంబంధించి 2017 నుంచి సుమారు రూ.83 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని సమాచారం. సోమవారం జీహెచ్‌ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది జయలలిత ఇంటిని సీజ్ చేశారు. మార్చి 31 వరకు ఓటీఎస్ స్కీమ్ అందుబాటులో ఉందని, ఆ రాయితీ పోగా మొత్తం రూ.82,91,822 మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జయలలితకు సంబంధించిన ఈ భవనంలో గతంలో ప్రైవేట్ కార్యాలయాన్ని నిర్వహించారు. అయితే ఈ భవనాన్ని 2017 నుంచి నివాసానికి వాడుకుంటున్నామని.. కాబట్టి రెసిడెన్షియల్‌గా మార్చాలని జీహెచ్‌ఎంసీ అధికారుల్ని జయలలిత మేనల్లుడు, చెన్నైకి చెందిన దీపక్ జయకుమార్ గతంలో కోరారు.

# శ్రీశైలంలో అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపి ప్రభుత్వం

## మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, మార్చి31 ప్రజావినికిడి,** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుంచి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో వేసివి నీటికి కటకట ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో పవర్ జెనరేషన్ చేయొద్దని నిబంధన ఉందని.. ట్రయిల్స్ చేయొద్దని జీవో కూడా ఉందని అన్నారు. తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని సమైక్య రాష్ట్రంలో ఇచ్చిన జీవో స్పష్టంగా ఉందని మంత్రి జూపల్లి అన్నారు. తెలంగాణ హైకోర్టులో గతంలో పిల్ ఫైల్ కూడా చేశామని..జస్టిస్ పినాకి గోష్ ఇచ్చిన తీర్పు కూడా ఉందని అన్నారు. కరెంటు ఉత్పత్తి చెయ్యడానికి వీలు లేదని అన్నారు. దొంగతనంగా కరెంటు తీసుకోవాల్సిన ఖర్మ ఏపీకి ఎందుకని అన్నారు మంత్రి జూపల్లి. ధర్నా చేస్తామని చెప్పడంతో ఏపీ ప్రభుత్వం పంపింగ్ ఉపసంహరణ చేసుకుందని అన్నారు. పాలమూరు రైతాంగం, ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. వాటర్ అలకేషన్ అంశం కోర్ట్ లో పెండింగ్ లో ఉందని... 69 శాతం తెలంగాణకు 31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం మన రాష్ట్ర హక్కును కాపాడుతుందని.. అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తోందని అన్నారు. మంత్రి జూపల్లి వ్యాఖ్యలతో ఏపీ తెలంగాణ మధ్య నీటి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతి

## హైదరాబాద్‌లో భారీగా శోభాయాత్ర

## సమీక్షించిన వివిధ శాఖల అధికారులు



**హైదరాబాద్, మార్చి31 ప్రజావినికిడి,:** ఏప్రిల్ 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో అత్యంత వైభవంగా 'వీర హనుమాన్ విజయ యాత్ర' నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గత 22 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ భారీ శోభాయాత్ర.. ఈ ఏడాది కూడా కర్మన్ ఘాట్ నుండి ప్రారంభమై గౌలిగూడ రామ్ మందిరం చేరుకుంటుంది. అక్కడి నుండి సికింద్రాబాద్ లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఈ యాత్ర సాగనుంది. ఈ భారీ యాత్రను పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, వీహెచ్‌పీ / భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు. యాత్ర సాగే మార్గంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం అధికారులు గౌలిగూడ రామ్ మందిరం నుండి అఫ్జల్ గంజ్ మీదుగా తాడ్ బండ్ వరకు రూట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్, పలు హిందూ సంఘాల నాయకులు పోలీసులకు కొన్ని ముఖ్యమైన విజ్ఞప్తులు చేశారు. గతంలో అబిడ్స్ చౌరస్తా వంటి ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి యాత్రకు ఆటంకం కలిగించారని, ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అలాగే యాత్ర ముగిసే వరకు ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను, అలంకరణలను తొలగించవద్దని విన్నవించారు. గణెలిష్ ఉత్సవాల తరహాలోనే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలకు కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా పండుగ వాతావరణంలో జరుపుకునేలా సహకరించాలని అధికారులను కోరారు.

# పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ

## దాడిచేసి సీజ్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, మార్చి31 ప్రజావినికిడి,**



నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ , హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు. ఈ సందర్భంగా హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. తనిఖీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ప్లాస్టిక్ డబ్బాల్లో, పరిశుభ్రతకు విరుద్ధంగా పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేస్ట్‌ను హోల్‌సేల్ కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో సుమారు రూ.22 లక్షల విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 4,032 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాసిరకం వెల్లుల్లి, 210 కిలోల నాసిరకం అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుడిని, స్వాధీనం చేసిన సామగ్రిని తదుపరి విచారణ కోసం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక






# కావ్య మారన్‌కు పోటీగా అనన్యా బిర్లా

ఐపీఎల్ లో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. ప్రముఖ ప్లేయర్లతో పాటుగా ఫ్రాంచైజీ ఓనర్లు అంతకంటే ఎక్కువ క్రేజ్ సంపాదిస్తున్నారు. ఇప్పటి వరకు ఐపీఎల్ లో కావ్య మారన్ కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. కావ్య మ్యాచ్ వేళ ఇచ్చే ఎక్స్ ప్రెషన్స్ ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటాయి. ఇప్పుడు కావ్యకు పోటీగా ఆర్సీబీ సొంతం చేసుకున్న అనన్యా బిర్లా క్రికెట్ వ్యాపారంలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా నిలుస్తున్నారు. దీంతో, ఇప్పుడు కావ్య వర్సెస్ అనన్య పోరు మొదలైంది. ఎవరి ఆస్తులు ఎంత.. ఎవరి వ్యాపారం ఏంటి..సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ కు ఐపీఎల్ లో మంచి క్రేజ్ ఉంది. కొన్నేళ్లుగా ఐపీఎల్ లో మోస్ట్ పాపులర్ లేడీ ఓనర్‌గా ఆమె కొనసాగుతున్నారు. వేలంలో ..గ్రౌండ్‌లో టీమ్ గెలిచిన సమయంలో ఇచ్చే చిరునవ్వుకు ఫిదా కావాల్సిందే. కాగా, తాజాగా ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్యా బిర్లా ఆర్సీబీ మేనేజ్‌మెంట్‌లో చేరడం లీగ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.ఆదిత్య బిర్లా గ్రూప్ ఏకంగా రూ. 16,706 కోట్లతో ఈ జట్టును దక్కించుకోవడంతో అనన్య ఇప్పుడు ఆర్సీబీకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు.నెటిజన్లు ఆమెను 'నేషనల్ క్రష్' అని, ఆర్సీబీకి దొరికిన 'లక్కీ చార్మ్' అంటూ పోస్టింగ్స్ చేస్తున్నారు. ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ ఓపెనింగ్ మ్యాచ్‌లో ఆట కంటే కూడా అనన్య, కావ్యల మీదనే కెమెరాలు ఎక్కువగా ఫోకస్ చేశాయి. సోషల్ మీడియా వేదికగా ఇద్దరి మద్దతు దారులు తమ అనుకూల పోస్టింగ్స్ తో చెలరేగారు. ఇక.. అనన్యా బిర్లా వ్యాపారవేత్త తో పాటుగా ఇంటర్నేషనల్ పాప్ సింగర్. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లో చదువుకున్న ఆమె, 17 ఏళ్ల వయసులోనే 'స్వతంత్ర మైక్రోఫిన్' సంస్థను స్థాపించి సక్సెస్ అయ్యారు. సంగీత రంగంలోనూ పట్టు ఉంది. డబ్బు పరంగా చూస్తే అనన్యా బిర్లా, కావ్య మారన్ కంటే చాలా ముందున్నారు. బిర్లా కుటుంబానికి సుమారు 19.1 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉంటే, మారన్ కుటుంబానికి 2.57 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి.






# బిగ్‌బాస్ బ్యూటీతో మహమ్మద్ సిరాజ్ డేటింగ్..?

టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్.. బిగ్ బాస్ ఫేమ్ మహిరా శర్మతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరూ ఒకే కాఫీ షాప్‌లో కలిసి కనిపించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ కాఫీ షాప్ నుంచి ఈ ఇద్దరూ విడివిడిగా బయటకు వచ్చినప్పటికీ, ఒకే సమయంలో అక్కడే ఉండటంతో సందేహాలు మొదలయ్యాయి. వీరిద్దరూ కలిసి క్వాలిటీ టైమ్ గడిపారని, ఈ ఇద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.అయితే ఈ డేటింగ్ వార్తలపై మహమ్మద్ సిరాజ్, మహిరా శర్మ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగని ఖండించను లేదు. సిరాజ్, మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నారని వార్తలు రావడం ఇదే తొలిసారి కాదు. 2024 చివర్లోనే ఈ ప్రచారం మొదలైంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒకరినొకరు ఫాలో అవ్వడం, ఫొటోలకు లైక్ చేసుకోవడంతో ఈ పుకార్లు మొదలయ్యాయి. గతేడాది ఈ డేటింగ్ వార్తలను సిరాజ్ ఖండించాడు. అవన్నీ అవాస్తవం, నిరాధారమైనవని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పెట్టాడు. ఆ వెంటనే ఆ పోస్ట్‌ను తొలగించాడు. మహిరా కూడా ఈ పుకార్లను ఖండించింది. తాను ఎవరితోనూ డేటింగ్‌లో లేనని, తన కెరీర్‌పై మాత్రమే ఫోకస్ పెట్టానని స్పష్టం చేసింది. కానీ ప్రతీ సెలెబ్రిటీ కపుల్ ఇలానే చెబుతుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో మహమ్మద్ సిరాజ్ గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతుండటంతో ఈ డేటింగ్ పుకార్లు మరోసారి తెరపైకి వచ్చాయి. పంజాబ్ కింగ్స్‌తో మరికాసేపట్లో ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌తో గుజరాత్ టైటాన్స్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న సిరాజ్.. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. జమ్మూ కశ్మీర్‌లో 1997లో పుట్టిన మహిరా శర్మ.. మోడల్‌గా కెరీర్ ప్రారంభించింది. సీరియల్స్‌తో యాక్టింగ్‌వైపు వచ్చింది. నాగిన్ 3 అనే సీరియల్‌లో 'చుర్భురి' పాత్రతో గుర్తింపు పొందింది. కుండలి భాగ్య, బేపనా ప్యార్ సీరియల్స్‌తో కూడా ఆమె పాపులారిటీని సొంతం చేసుకుంది. సల్మాన్ ఖాన్ హోస్ట్ చేసిన బిగ్ బాస్ హిందీ సీజన్ 13లో కంటెస్టెంట్‌గా పాల్గొని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

# షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా

పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీ లాహోర్ ఖలందర్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా విధించింది. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నలుగురు వ్యక్తులను జట్టు బస చేస్తున్న హోటల్ గదిలోకి బలవంతంగా తీసుకెళ్లినట్లు ఆరోపణలు రావడంతో ఏకంగా రూ.10 లక్షలు (పాక్ కరెన్సీలో) ఫైన్ వేసింది. జట్టులో క్రమశిక్షణను కాపాడటం, జవాబుదారీతనాన్ని నిర్ధారించే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పంజాబ్ పోలీసులు పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నసీర్ కు రాసిన లేఖలో అఫ్రిదితో పాటు ఆ జట్టు ఆటగాడు సికిందర్ రజాపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు న్యూస్18 ఇంగ్లీష్ పేర్కొంది. నలుగురు సందర్శకులను హోటల్ లోకి అనుమతించాలని వీరు కోరగా భద్రతా సిబ్బంది నిరాకరించారు.అయినా సరే వారు ఆ నలుగురిని గదిలోకి తీసుకెళ్లారని, దాదాపు మూడు గంటల పాటు అక్కడే ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన పీఎస్ఎల్ సీజన్ లో



లాహోర్ జట్టు పేలవ ప్రదర్శనతో టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం అందరికీ తెలిసిందే. వివాదాలు కూడా ఈ జట్టును వెంటాడుతున్నాయి.ఈ ఘటనపై లాహోర్ ఖలందర్స్ యాజమాన్యం స్పందిస్తూ, క్రమశిక్షణతో జవాబుదారీతనం ప్రదర్శించే ఉద్దేశంతోనే షాహీన్ షా అఫ్రిదిపై పది లక్షల రూపాయల జరిమానాను స్వచ్ఛందంగా విధించినట్లు వెల్లడించింది. ఈ విషయమై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కు పూర్తి వివరాలతో కూడిన వివరణను అధికారికంగా పంపినట్లు తెలియజేసింది. ఆటగాళ్లు, అధికారులు, ప్రేక్షకుల భద్రతను నిర్ధారించడంలో భద్రతా సిబ్బంది చేస్తున్న కృషిని ఫ్రాంచైజీ మనస్ఫూర్తిగా ప్రశంసించింది. నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాలనే ఆలోచన ఆటగాళ్లకు లేదని, కేవలం ఒక చిన్న అపార్థం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఫ్రాంచైజీ యాజమాన్యం వివరించింది. అయితే భద్రతా ప్రోటోకాల్స్ పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని వారు పునరుద్ఘాటించారు. మరోవైపు భద్రతా ఉల్లంఘన ఘటనకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నానని సికిందర్ రజా స్పష్టం చేశాడు.

# రాజకీయాల్లోకి టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. 2026 మార్చి 31న భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందర్ సమక్షంలో ఆయన భారతీయ జనతా పార్టీలో చేరి కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ చేరిక బీజేపీకి అదనపు బలాన్నిచ్చింది. యువతను ఆకర్షించే వ్యూహాత్మక అడుగుగా పార్టీ భావిస్తోంది. లియాండర్ పేస్ ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తూ యువ ఓటర్లపై సానుకూల ప్రభావం చూపుతారని బీజేపీ నమ్ముతోంది.లియాండర్ పేస్ 1973 జూన్ 17న కోల్‌కతాలో క్రీడా నేపథ్యమున్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి వెంకట్రామన్ 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో హాకీ కాంస్యం సాధించగా, తల్లి జెన్నిఫర్ 1980 ఆసియా బాస్కెట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించారు. గత ఏడాది ఆయన తండ్రి కన్నుమూశారు. పేస్ 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్‌లో బ్రెజిల్‌కు చెందిన ఫెర్నాండో మెలిగెనిని ఓడించి కాంస్యం గెలిచారు. వ్యక్తిగత ఒలింపిక్ పతకం సాధించిన కేడీ జాదవ్ తర్వాత తొలి భారతీయుడు ఆయనే. ఆయనకు 1990 అర్జున, 1996 ఖేల్ రత్న, 2001 పద్మశ్రీ, 2014 పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. పురుషుల సింగిల్స్‌లో గ్రాండ్‌స్లామ్‌లు లేకున్నా డబుల్స్‌లో పేస్ చరిత్ర సృష్టించారు. పురుషుల డబుల్స్‌లో మొత్తం ఎనిమిది గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (2012 ఆస్ట్రేలియన్ ఓపెన్ సహా పలుమార్లు ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) కైవసం చేసుకున్నారు.

# వైభవ్ సూర్యవంశీని భారత జట్టులోకి తీసుకోవద్దు..

## అశ్విన్ సంచలన వ్యాఖ్యలు.!



చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు చేసిన వైభవ్ ఆటతీరుకు అందరూ ఫిదా అయ్యారు. ఈ ప్రదర్శన తర్వాత అతడిని జాతీయ జట్టులోకి 'ఫాస్ట్ ట్రాక్' చేయాలని కొందరు నిపుణులు కోరుతున్నారు. అయితే, తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన అశ్విన్.. వైభవ్‌పై ఇప్పుడే అంచనాల భారం వేయవద్దని సూచించాడు."అతనికి ఇప్పుడే లక్ష్యాలు నిర్దేశించకండి. అతను ఇంకా పిల్లాడే. ఒకవేళ ఎంఎస్ ధోనీ 44 ఏళ్ల వరకు ఆడితే, వైభవ్ 40 ఏళ్ల వరకు ఆడినా అతనికి ఇంకా రెండున్నర దశాబ్దాల క్రికెట్ కెరీర్ మిగిలి ఉంది. అతడిని ప్రశాంతంగా వదిలేయండి, సమయం వచ్చినప్పుడు అతనే తన సత్తాతో భారత జట్టులోకి వస్తాడు. అతను టీమ్ ఇండియాకు ఆడటంలో సందేహం లేదు, కానీ అంత తొందర ఎందుకు?" అని అశ్విన్ ప్రశ్నించాడు. తన మాజీ జట్టుపై వైభవ్ చేసిన దాడిని అశ్విన్ కొనియాడాడు. వైభవ్ బ్యాట్ స్పీడ్ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని, అతని వద్ద ఉన్న ఆత్మవిశ్వాసం అసాధారణమని పేర్కొన్నాడు. 15 ఏళ్లు నిండిన కొద్ది రోజుల్లోనే, 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది తన వయస్సును స్కోరు బోర్డుపై చూపించాడని చమత్కరించాడు. "వైభవ్ దాటికి సీఎస్‌కే బౌలర్ల వద్ద సమాధానం లేదు. మైదానంలో వారు పూర్తిగా డీలా పడిపోయారు. రాజస్థాన్ రాయల్స్ ఈ ప్రదర్శన ద్వారా తాము కూడా ఈ టోర్నీలో అత్యంత శక్తివంతమైన జట్టు అని చాటిచెప్పారు" అని అశ్విన్ విశ్లేషించాడు.

# రిటైర్‌మెంట్‌పై ఊహాగానాలకు మహ్మద్ షమీ చెక్

సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి టీమిండియాలోకి దారులన్నీ దాదాపు క్లోజ్ అయిన విషయం తెలిసిందే. వయసు ప్రభావం, ఫిట్‌నెస్ సమస్యలను కారణంగా చూపుతూ.. సెలెక్షన్ కమిటీ షమీ పేరును పరిగణలోకి తీసుకోవట్లేదు. దీంతో దేశవాళీలో సత్తా చాటుతున్నా.. షమీకి మాత్రం పిలుపురావడం లేదు. గతంలో టెస్టులు, వన్డేలు, టీ20 ఇలా మూడు ఫార్మాట్లలోనూ అదరగొట్టిన షమీని మళ్లీ టీమ్‌లోకి తీసుకోవాలని.. అతని అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీలు కూడా సూచించారు. షమీ తన చివరి వన్డే.. 2025 మార్చి 9న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడాడు. చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ను 2025 ఫిబ్రవరి 2న ముంబైలో ఇంగ్లాండ్‌పై ఆడాడు. ఇక టెస్టు క్రికెట్ ఆడి మూడేళ్లకుపైనే అయింది. ఈ నేపథ్యంలోనే షమీ రిటైర్‌మెంట్ విషయంపై క్లారిటీ ఇచ్చేశాడు.'ది శుభంకర్ మిశ్రా షో' మహ్మద్ షమీ మాట్లాడుతూ.. తాను అలసిపోయినప్పుడు క్రికెట్ వీడ్కోలు పలుకుతానని.. ప్రస్తుతానికి రిటైర్‌మెంట్ గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేశాడు. రిటైర్‌మెంట్ ఆలోచన మనల్ని మరింత వెనక్కి లాగుతుందని.. ఆ ఆలోచన వస్తే అప్పటికే అలసిపోయారని అర్థమన్నారు. ఏ రోజు ఉదయాన్ని తాను నిద్రలేచిన తరువాత విసుగు పుడుతుందో.. అదే రోజు ఆటకు గుడ్ బై చెబుతానని అన్నాడు. బద్ధకం వచ్చినా.. విసుగు పుట్టినా.. అలసిపోయినా రిటైర్‌మెంట్ ప్రకటిస్తానని వెల్లడించాడు. ప్రస్తుతం తనకు బద్ధకం లేదని.. ఆటను ఆస్వాదిస్తున్నానని చెప్పుకొచ్చాడు షమీ. ఒక బౌలర్‌గా తాను వందశాతం తన బాధ్యతలు నెరవేరుస్తానని.. తనపై ఉంచిన అంచనాలకు అనుగుణంగా రాణిస్తానని అన్నాడు. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన షమీ.. ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. షమీపై వా=ు టీమ్ భారీ అంచనాలు పెట్టుకోగా.. ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు గుజరాత్ టైటాన్స్ టీమ్‌తో ట్రేడ్ డీల్ చేసుకుంది. లక్నో తరఫున దుమ్ములేపి.. టీమిండియా జెర్సీలో షమీని మళ్లీ చూడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# శర్వా 'బైకర్'కు సెన్సార్ పూర్తి...

## ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్



యంగ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హై-ఆక్టేన్ స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్' విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుంచి యూ/ఏ (ఖ/ూ) సర్టిఫికెట్ పొందింది. దీంతో సినిమా విడుదలకు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.
ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమాకు అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించారు. తమిళనాడులో ఈ చిత్రాన్ని థింక్ స్టూడియోస్ విడుదల చేస్తోంది. "ఇక అతడిని ఆపడం ఎవరి తరమూ కాదు" అనే క్యాప్షన్‌తో రిలీజ్ పోస్టర్‌ను విడుదల చేసి, విడుదల తేదీని ఖరారు చేసింది.
ఈ సినిమాలో సీనియర్ నటుడు రాజశేఖర్ 'బుల్లెట్' సునీల్ అనే కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియోలో, భారత రేసర్లు ఓడిపోవడానికి పుట్టలేదని నిరూపించాలనే తపన ఉన్న మాజీ మోటోక్రాస్ రేసర్‌గా రాజశేఖర్ పాత్ర ఆకట్టుకుంది. ఆయన కెరీర్‌లో 18 ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లు, 57 సౌత్ జోన్ టైటిల్స్ గెలిచినట్టు చూపించారు.
'బైకర్' చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. డేరింగ్ బైక్ రేసర్‌గా కనిపించడం కోసం శర్వానంద్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, జె. యువరాజ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. భారీ అంచనాల మధ్య ఈ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# అందుకే వారిని పట్టించుకోవడం మానేశా

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నిహారిక తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా సమాధానమిచ్చారు.
నిర్మాతగా కెరీర్ ప్రారంభించినప్పటి నుండి తనపై ఎన్నో విమర్శలు వస్తున్నాయని నిహారిక ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఏం చేసినా తప్పు పట్టేవాళ్లు ఉంటూనే ఉంటారు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో 11 మంది కొత్తవాళ్లను పరిచయం చేసినప్పుడు.. ఎందుకు ఇదంతా? తెలిసిన వాళ్లతో సినిమాలు చేయొచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' వంటి హై-వోల్టేజ్ వీఎఫ్ఎక్స్ సినిమా చేస్తుంటే... మళ్లీ చిన్న కథలే చేయొచ్చు కదా అని సలహాలు ఇస్తున్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉంటారు, అందుకే వారిని పట్టించుకోవడం మానేశాను" అని ఆమె తెలిపారు.నిర్మాతగా ప్రతి సినిమా తనకు ఒక పాఠమని, నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని నిహారిక తెలిపారు. "నాకు కొణిదెల కుటుంబం ఎంత ముఖ్యమో, నా 'పింక్ ఎలిఫెంట్' టీమ్ కూడా అంతే ముఖ్యం. నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను" అని ధీమా వ్యక్తం చేశారు.



# అందరినీ అలరించే కథ

ఒజి, శ్రీ సీతా రాముల కల్యా ణం చూత ము రారండి, అన్న య్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరోగా రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. సమ్మర్ స్పెషల్ గా మే 8న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. "ఇది పూర్తిగా మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో వుంటాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించే కథ. వెంకట్‌కి ఇది మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది"అని చిత్ర నిర్మాతలు తెలియజేశారు. ఈ చిత్రంలో హెబ్బాపటేల్, సలోని, నాటషా, అలీ, సుమన్,రవి వర్మ, సుభాశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# అనుష్క 'కథనార్' ట్రైలర్ వచ్చేసింది..

## హాలీవుడ్ స్థాయిలో ఫాంటసీ హారర్ థ్రిల్లర్!

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కథనార్' ట్రైలర్ విడుదలైంది. మలయాళంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ట్రైలర్, ప్రేక్షకులలో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో విశేష స్పందన దక్కించుకుంటోంది.
రోజిన్ థామస్ దర్శకత్వంలో శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయసూర్య, ప్రభుదేవా, వినీత్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 13వ శతాబ్దం నాటి కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో అనుష్క పాత్ర ఎంతో గంభీరంగా, మిస్టరీతో కూడుకుని ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. పీరియాడిక్ సెట్టింగ్స్, వీఎఫ్ఎక్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
'బాహుబలి' తర్వాత సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న అనుష్కకు ఈ సినిమా ఎంతో కీలకంగా మారింది. ఇటీవల ఆమె నటించిన 'ఘాటీ' ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 'కథనార్' చిత్రంలో అనుష్క పోషిస్తున్న శక్తిమంతమైన పాత్ర ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ సినిమాతో స్వీటీ బలంగా కంబ్యాక్ ఇస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.






# సల్మాన్ సరసన నయన్..

## వంశీ పైడిపల్లి సినిమాలో అధికారిక ప్రకటన

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఖరారు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌పై అగ్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వారి 63వ చిత్రం ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతారకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నామని, 'ది క్వీన్' అడుగుపెట్టిందని నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.ఇప్పటికే నయనతార బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంలో నటించి భారీ బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులను సైతం మెప్పించిన ఆమె, ఇప్పుడు మరో అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో జతకట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు దర్శకుడు, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ కలిసి చేస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# పొరపాటున అలా మాట్లాడాను..

## 'పెద్ది' టీమ్‌కు ఎస్‌కేఎన్ క్షమాపణ





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా బృందానికి ప్రముఖ నిర్మాత ఎస్‌కేఎన్ బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. 'పెద్ది' విడుదల వాయిదా పడిందంటూ తాను చేసిన వ్యాఖ్యలు పొరపాటని, వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు ఓ వీడియో ద్వారా స్పష్టం చేశారు.
అసలేం జరిగిందంటే.. ఎస్‌కేఎన్ తన సొంత నిర్మాణ సంస్థలో వస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా విడుదల తేదీని ప్రకటించే క్రమంలో నిన్న రాత్రి 'పెద్ది' గురించి మాట్లాడారు. ఏ పెద్ద సినిమా విడుదలయ్యే తేదీలో తమ చిత్రాన్ని తీసుకురావొద్దనే ఉద్దేశంతోనే తాను అలా వ్యాఖ్యానించానని, కానీ అది పొరపాటుగా దొర్లిందని వివరించారు.
ఈ సందర్భంగా 'పెద్ది' సినిమా గురించి ఆయన సానుకూలంగా మాట్లాడారు. ఆ చిత్రం అనుకున్న సమయానికే విడుదలై ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాత ఎస్‌కేఎన్ తాజా వివరణతో ఈ అంశంపై నెలకొన్న గందరగోళానికి తెరపడినట్లయింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613